పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

సమాజాభివృద్ధికి సహకరించాలి

- సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్యానికి ఖర్చు చేస్తాం
- కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : సమాజ అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు సహకరించాలని కలెక్టర్ రాజర్షి షా కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పారిశ్రామిక వేత్తలతో సీఎస్ఆర్ ఫండ్స్‌పై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. పారిశ్రామిక వేత్తలు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్) ఫండ్స్‌కు ప్రతి పారిశ్రామిక కేంద్రం 2 శాతం నిధులు కేటాయించాలని సూచించారు. సీఆర్ఎస్ నిధులను జిల్లాలో విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేశ్, జిల్లా పారిశ్రామిక అధికారి కృష్ణ మూర్తి, కాలుష్య నియంత్రణ అధికారి కుమార్ పాఠక్, జిల్లా అధికారులు, పారిశ్రామిక వేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రభుత్వ భూముని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని తిర్మలాపురం శివారులో ప్రభుత్వ భూమిని (సర్వే నెంబర్ 1) ఆక్రమించినవారిపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానికుల ఫిర్యాదుతో మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌తో కలిసి శనివారం తిర్మలాపురం శివారులోని ప్రభుత్వ భూములను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం ఆర్డీవో, డీపీవో భూములను పరిశీలించారన్నారు. త్వరలో భూములను సర్వే చేసి, హద్దులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ గ్రేసీబాయి, ఆర్ఐ శరణప్ప ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

టవర్ ఎక్కిన యువకుడు

కొల్చారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న టవర్ ఎక్కిన యువకుడు

కొల్చారం, ఫిబ్రవరి 3 : భార్య కాపురానికి రావడం లేదని ఒక వ్యక్తి కొల్చారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న నిర్మాణంలో ఉన్న టవర్ ఎక్కి ఆందోళన చేసిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు టవర్ ఎక్కాడు. పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన డి.దేవీసింగ్ తన భార్య కాపురానికి రావడం లేదని కొల్చారం పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. భార్య రావడం లేదని.. తాను చనిపోతానని చెప్పడంతో ఎస్సై మహ్మద్‌గౌస్ సిబ్బందితో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు రాగానే దేవీసింగ్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిర్మాణంలో టవర్ టవర్ ఎక్కి సుమారు 20 నిమిషాల పాటు దూకుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఎస్సై గౌస్ బాధితుడితో మాట్లాడి, హామీ ఇవ్వడంతో టవర్ దిగాడు. వెంటనే పోలీసులు దేవీసింగ్‌ను భార్య పుట్టింటికి తీసుకెళ్లారు.

కార్మికులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం

వెల్దుర్తి, ఫిబ్రవరి 3 : కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను శనివారం వెల్దుర్తిలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. కేంద్రం ప్రభ్వుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అచ్చే దిన్, మేకిన్ ఇండియా అంటూ మోసపూరిత నినాదాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ పదేండ్లలో కార్మికుల కోసం ఒక్క పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు దుర్గపతి, వెంకట్, రవి, సాయిలు, సత్తయ్య పాల్గొన్నారు.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్ ఎన్నిక

మెదక్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): భూముల రక్షణతోపాటు వివాదాల పరిష్కారంలో సర్వేయర్ల పాత్ర కీలకమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో శనివారం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘ సమావేశాన్ని నిర్వహించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.యాదగిరిగౌడ్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా పి.మొగులయ్య, కోశాధికారిగా శ్రవణ్‌రావు, ఉపాధ్యక్షులుగా శశికుమార్, ఆర్.సంధ్య, సంయుక్త కార్యదర్శులుగా నర్సింగ్‌రావు, బి.అనురాధ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.దుర్గాభవాని, ప్రచార కార్యదర్శిగా ఎం. శ్రీను, కార్యవర్గ సభ్యులుగా దత్త స్వరూప్, జి.ప్రశాంత్ ఎన్నికయ్యారు. టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ భాషా మాట్లాడారు. వ్యవసాయ భూములు ఆక్రమణకు గురికాకుండా సర్వేయర్లు రైతులకు న్యాయం చేస్తున్నారని అభినందించారు. నూతన పెన్షన్ విధానం, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం రద్దుతోపాటు ఆదాయ పన్ను పరిమితి పెంపుపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



సర్వేయర్ల జిల్లా కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఓదార్చి.. ఆర్థిక సాయం అందజేసి..



శివ్వంపేట: బాధితుడి కుటుంబీకులకు సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం: మృతుడు, వార్డు సభ్యుడు మహ్మద్ కుమారుడు సోహెల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

బాధిత కుటుంబాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శ

శివ్వంపేట, ఫిబ్రవరి 3 : శివ్వంపేట మండలం చండి, గంగాయిపల్లి, దొంతి గ్రామాల్లో బాధిత కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా నేనున్నానని ధైర్యం కల్పించి ఆర్థికసాయం అందజేశారు. ముందుగా చండి గ్రామంలోని చండిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉసిరికపల్లి గ్రామానికి చెందిన సిలువేరు మణిచందర్ కుటుంబ సభ్యులకు రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, ఉపసర్పంచ్ రేణుకుమార్, బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, సర్పంచ్‌లు ఉమారెడ్డి, చంద్రకళ, అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు సిలువేరు ఆంజనేయులు, మర్రి మహేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

కొల్చారంలో..

కొల్చారం, ఫిబ్రవరి 3 : మండలకేంద్రం కొల్చారంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. కొల్చారం వార్డు సభ్యుడు మహ్మద్.. గ్రామానికి చెందిన ఆరీఫ్‌తో కలిసి శుక్రవారం బైక్‌పై వస్తుండగా రోడ్డు పక్కనే ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆరీఫ్ అక్కడికక్కడే మృతి చెందగా, మహ్మద్ మెదక్ దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇద్దరి అంత్యక్రియలు శుక్రవారం రాత్రి జరిగాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి కొల్చారంలో మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మంజులా కాశీనాథ్, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ చెన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌కుమార్, బాగారెడ్డి, మొయినుద్దీన్, నర్సింహులు, చక్రధర్ గౌడ్, కృష్ణ, కరెంటు రాజాగౌడ్, దుర్గాప్రసాద్‌గౌడ్, వడ్ల ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, అంజయ్య, పాండ్ర వెంకటేశం, సొసైటీ చైర్మన్ మనోహర్ ఉన్నారు.

ఎస్‌డీఎఫ్ రూ.20 కోట్లు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతితో అభివృద్ధి పనులు
- ప్రతి నియోజకవర్గంలో పాఠశాలలకు రూ.2 కోట్లు
- తాగునీటికి రూ.కోటి, కలెక్టరేట్ నిర్వహణకు రూ.50 లక్షలు
- రూ.6.50 కోట్లతో డెవలప్‌మెంట్ నిధులు

మెదక్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ నియోజకవర్గాల పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుగా నిధులు కేటాయించింది. జిల్లాల వారీగా ఇదివరకే ఇన్‌చార్జి మంత్రులను నియమించిన ప్రభుత్వం... తాజాగా నియోజకవర్గాలకు నిధులు కేటాయించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అనుమతితో అభివృద్ధి పనులు మంజూరు చేయనున్నారు. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయించింది. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజవకర్గాలకు 'స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద రూ.20 కోట్లు మంజూరు చేసింది. రూ.10 కోట్లలో రూ.2 కోట్లను నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకించింది. రూ.కోటిని తాగునీటి వసతులకు, రూ.50 లక్షలను కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వాహణకు కేటాయించింది. ఈ నిధులతో చేపట్టే పనులను ఇన్‌చార్జి మంత్రి ద్వారా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

సీడీపీ నిధులు రూ.3 కోట్లు...

2023-24 సంవత్సరానికి సీడీపీలో రూ.3 కోట్లు మంజూరు చేశారు. మెదక్ నియోజకవర్గంలో 58 పనులకు రూ.2 కోట్ల 97 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే 19 పనులు పూర్తి కాగా, రూ.83 లక్షల బిల్లులు విడుదలయ్యాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో 81 పనులకు రూ.2 కోట్ల 89 లక్షలు మంజూరయ్యాయి. బిల్లులు చెల్లించలేదని సీపీవో కృష్ణయ్య తెలిపారు.

సాంఘీక శాస్త్రంతోనే నైతిక విలువలు

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్

జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 3 : పోటీ పరీక్షల్లో సాంఘీక శాస్త్రం కీలమని, సాంఘిక శాస్త్రంతోనే విద్యార్థుల్లో నైతిక భావాలు, నైతిక విలువలు పెంపొందుతాయని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆయా మండలాల్లో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. విజేతలుగా నిలిచినవారికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయులదేనని డీఈవో సూచించారు. విద్యార్థులను విభిన్న రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం, సోషల్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులు, ప్రభాకర్, సభ్యులు చల్లా లక్ష్మణ్, దత్తేత్రేయ కులకర్ణి, దేవీసింగ్, రవిబాబు, వీరేశం, సత్యనారాయణ, సిద్ధిరాములు, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గొల్పర్తి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రాజ్‌నారాయణ

రామాయంపేట, ఫిబ్రవరి 3 : వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లేకుంటే సూక్ష్మ పోషకాలు అధికమై పంటను నాశనం చేస్తాయని మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ తెలిపారు. శనివారం రామాయంపేట మున్సిపాలిటీలోని కోమటిపల్లి, గొల్పర్తి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పొలంలో నీటి తడులను తగ్గించాలన్నారు. వరిలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి పూట సోలార్ లేదా విద్యుత్ లైట్లను పొలం మధ్యలో ఏర్పాటు చేస్తే దోమకాటును నివారించవచ్చన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 8కేజీలు లేదా పిప్రోనిల్ 4కేజీలు లేదా క్లోరాంథోనిప్రోల్ 4కేజీలు చల్లాలని రైతులకు సూచించారు.

సూక్ష్మపోషకాలు పోవడం కోసం వరి మడుల్లో సోలార్ దీపాలు

కొల్చారం : కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బంజారాభేరి సంఘం నాయకులు

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

మెదక్ మున్సిపాలిటీ/కొల్చారం, ఫిబ్రవరి 3: గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15వ తేదీని సెలవు రోజుగా ప్రకటించాలని బంజారా, గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు శనివారం కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బంజారా భేరి జిల్లా అధ్యక్షుడు ధన్‌సింగ్‌నాయక్, నాయకులు సూర్యం చౌహాన్, అంబర్‌సింగ్, చత్రుచౌహాన్, రాజేందర్, కిషన్‌నాయక్, రాంచందర్, వినోద్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థత

రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

రామాయంపేట, ఫిబ్రవరి 3: చేగుంట మండలంలోని బోనాల్ కొండాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన శనివారం జరిగింది. బోనాల్ కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో కొందరు విద్యార్థులు తిరుపతి పుణ్యక్షేత్రం నుంచి తీసుకొచ్చిన లడ్డూను శనివారం తోటి విద్యార్థులకు పంచి పెట్టారు. ఈ క్రమంలో లడ్డూ తిన్న ఐదుగురు విద్యార్థులు తమకు కండ్లు తిరుగుతున్నాయని హెచ్ఎంకు చెప్పారు. ఆయన వెంటనే 108 అంబులెన్స్‌ను తెప్పించి, రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స అందించడంతో విద్యార్థులు కోలుకున్నారు.

మహిళపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

వెల్దుర్తి, ఫిబ్రవరి 3 : భూమిని కబ్జా చేయడమే కాకుండా పట్టాదారురాలిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవతాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి పంచాయతీలోని శేరీల గ్రామశివారులో సర్వే నంబర్ 728/12లోని రెండు ఎకరాల భూమి శేరీల గ్రామానికి చెందిన సుగుణ పేరున ఉన్నది. కాగా, మాసాయిపేట గ్రామానికి చెందిన సాయి, రవి, వెంకటేశ్ భూమిని కబ్జా చేశారు. ఈ క్రమంలో కబ్జాను అడ్డుకున్న పట్టాదారు సుగుణను దుర్భాషలాడుతూ కొట్టారు. బాధితురాలి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైని సన్మానించిన యువజన నాయకులు

ఎస్సై నవతకు అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేస్తున్న అంబేద్కర్ సంఘం సభ్యులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 3 : ఎస్సై నవతాగౌడ్‌ను శనివారం అంబేద్కర్ సంఘం వెల్దుర్తి కమిటీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో సన్మానించి, అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. శాంతి భద్రతల పరిక్షణకు పోలీసుశాఖకు యువజన సంఘాల నాయకులు సహకరించాలని ఎస్సై సూచించారు. ఎస్సైని కలసినవారిలో అంబేద్కర్ సంఘం పట్టణాధ్యక్షుడు రవీందర్, సభ్యులు కుమార్, అశోక్, రమేశ్, సుధాకర్, అర్జున్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులు రాములు, కిరణ్

వెల్దుర్తి, ఫిబ్రవరి 3 : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల కమిటీని వెల్దుర్తిలో శనివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా మంగళపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన రాములు, ప్రధాన కార్యదర్శిగా బండపోసాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కిరణ్, ఉపాధ్యక్షులుగా అక్బర్‌పాషా, రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు జబ్బార్, రమేశ్‌గౌడ్, నాయకులు పోచయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామంలో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న కార్యదర్శి, గ్రామస్తులు

ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల కళాశాలలో నెల రోజులపాటు ఆంగ్లం బోధించడానికి బీఎడ్, పీజీ పూర్తి చేసి టీచింగ్‌లో మూడేండ్ల అనుభవం ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సురేఖ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఈ నెల 5, 6వ తేదీల్లో సంగారెడ్డి జిల్లా కంది మండలకేంద్రంలోని ఆర్ఎల్‌సీ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. ప్రతిభ, డెమో క్లాస్ ఆధారంగా అభ్యర్థిని ఎంపిక చేస్తామని, సందేహాలుంటే 7673917990, 6309008756 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సురేఖ సూచించారు.

15లోగా చలాన్లు చెల్లించాలి

నిజాంపేట, ఫిబ్రవరి 3 : వాహనదారులు ట్రాఫిక్ ఈ-చలాన్లు వెంటనే చెల్లించాలని ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా వాహనదారులు ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీని వినియోగించుకుని ట్రాఫిక్ ఈ-చలాన్లను చెల్లించాలని కోరారు.

నిరుద్యోగులకు స్వయం ఉపాధిపై శిక్షణ

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 3: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతకు వివిధ స్వయం ఉపాధి కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడాల అధికారి నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ టీవీ రిపేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ హైస్ వైరింగ్, మొబైల్ సర్వీసింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి 7వ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉతీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 10వ తేదీలోగా శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడు నెలల శిక్షణ కాలానికి రూ.1500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్ అందజేస్తామని, వివరాలకు 7396313741, 034734440 ఫోన్ నంబర్లను సంప్రదించాలని నాగరాజు సూచించారు.

అక్రమ మద్యం పట్టివేత

చిలిపిచెడ్, ఫిబ్రవరి 3: చిలిపిచెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో బెల్ట్‌షాపుపై పోలీసులు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా నిల్వ ఉంచిన మద్యం 31.26 లీటర్లు రూ.21,126 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ఈ మేరకు బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఏఎస్సై మిస్బాద్దీన్, పోలీసు సిబ్బంది శంకర్, దేవీసింగ్ ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మినీ వ్యాన్

రామాయంపేట, ఫిబ్రవరి 3 : ఆగిఉన్న ట్రాక్టర్‌ను మినీవ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన రామాయంపేట మండలం వెంకటాపూర్ (ఆర్) గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. దౌల్లాబాద్ నుంచి రామాయంపేటకు వస్తున్న మినీ వ్యాన్ మార్గమధ్యలో వెంకటాపూర్(ఆర్) గ్రామంలో అదుపు తప్పి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న రామకృష్ణ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు 108 అంబులెన్స్‌లో తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దండోరా ఉద్యమ నాయకుడు వాల్మీకి మృతి

వాల్మీకి (ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 3: మాదిగ దండోరా ఉద్యమ నాయకుడు నాయికోటి వాల్మీకి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా హోలియ దాసరి సంఘం నాయకుడు శాఖమూరి యాదగిరి మాట్లాడుతూ.. వాలీకి మృతి ఉద్యమాలకు తీరని లోటన్నారు. శనివారం వాల్మీకి అంత్యక్రియలు నర్సాపూర్‌లో జరిగాయి. అంత్యక్రియలకు ఎమ్మార్పీఎస్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, ఉషన్న, మురళి, కొమ్ము షేకులు, బుచేంద్ర, రాజు, బైల్పాటి గణేశ్ హాజరై నివాళులర్పించారు.

మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలి

కొల్చారం, ఫిబ్రవరి 3 : గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పిస్తూ.. మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఎంపీడీవో గణేశ్‌రెడ్డికి పంచాయతీ సిబ్బంది సమ్మె నోటీసు అందజేశారు.

నోటీసు అందజేస్తున్న కార్మికులు